

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
- ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు 6

ఉత్సాహంగా తీజ్ సంబరాలు
● తొమ్మిది రోజుల పాటు సాగిన బంజారాల వేడుక 5

నిరీక్షణ



- వానాకాలం సాగు పూర్తయినా అందని 'రైతు భరోసా'
- రైతుల అభిప్రాయ సేకరణ.. ఉపసంఘం ఏర్పాటు
- పెట్టుబడి సాయం లేక అన్నదాతల ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రుణమాఫీలో పలు సాంకేతిక కారణాలు, రేషన్ కార్డులు లేకపోవడం వంటి అంశాలతో కొందరికి రుణమాఫీ కాకపోయినా మెజార్టీగా రూ 2 లక్షల రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతల్లో రెండు లక్షల రూపాయలు రైతు రుణమాఫీ పూర్తి చేసిన ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టత రాకపోవడంతో రైతులకు నిరీక్షణే మిగిలింది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అరు గ్యారంటీల్లో రైతు భరోసా కీలకమైంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఎకరానికి యాసంగి, వానాకా లం పంటలకు పది వేల రూపాయల ఆర్థిక సాయా న్ని అందిస్తే కాంగ్రెస్ 15 వేల రూపాయలు, రైతు కూలీలకు 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. యాసంగిలో పాత పద్ధతిలో ఎకరానికి ఎనిమిది వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి పంటల సాగు రైతులు పూర్తి చేసుకున్నా ఇప్పటి వరకు రైతు భరోసా ఊసే ప్రభుత్వం ఎత్తక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు బంధులో గత ప్రభుత్వం అమలు చేసిన తీరులో అనేక తప్పిదాలున్నాయని, వాటిని సవరించి రైతు భరోసా పేరుతో కొత్త పథకం తీసుకు వచ్చింది. విధివిధానాలను రూపొందించడానికి మంత్రి వర్గం ఉప సంఘం కూడా ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో మంత్రులు ప్రజా భిప్రాయ సేకరణ చేశారు. జిల్లాలో అధికారులు ప్రజాభిప్రాయ శిబిరాలను పెట్టారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 24 వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా శిబిరాలను నిర్వహించారు. జిల్లాలో పెద్దూర్, ముస్తాబాద్, సిరిసిల్ల, నేరేళ్ల, మాన్వాడ, నర్సింగాపూర్, కొలనూర్, కోనరావుపేట, కోరెం, బోయినపల్లి, చందుర్తి, సనుగుల గాలిపెల్లి, ఇల్లంతకుంట, మానాల, రుద్రవరం, గంభీరావుపేట, కొత్తపల్లి, అల్మాస్‌పూర్, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, పోత్గల్, నాంపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతు భరోసాపై శిబిరాలను నిర్వహించారు. ఎన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలి.. ఏ విధంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయ సేకరణలు పూర్తి చేశారు. ఇప్పటి వరకు రైతు భరోసాకు సంబంధించి మార్గదర్శకాలు రాకపోవడంతో పెట్టుబడి సాయం ఆలస్యం అవుతుందనే అభిప్రాయం రైతుల్లో నెలకొంది.

2.32 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు

వానాకాలం పంటల సాగు పూర్తి కావడంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రాప్ బుకింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా పెట్టుకున్నా 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాలు, పత్తి, 49,332 ఎకరాలు, మొక్కజొన్న 1,246 ఎకరాలు, పెసర 56.26 ఎకరా లు, కందులు 939 ఎకరాలు, ఇతర పంటలు 162 ఎకరాలు చేశారు. సాగైన పంటల్లో గంభీరావు పేటలో 19,036 ఎకరాలు, ఇల్లంతకుంటలో 37,209 ఎకరాలు, ముస్తాబాద్‌లో 23,060 ఎకరాలు, సిరిసిల్ల 5,352 ఎకరాలు, తంగళ్లపల్లిలో 20,405 ఎకరాలు, వీర్నపల్లి 7,314 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 20,881 ఎకరాలు, బోయినపల్లిలో 20,044 ఎకరాలు, చందు ర్తి 21,346 ఎకరాలు, కోనరావుపేటలో 25,535 ఎక రాలు, రుద్రంగిలో 9,342 ఎకరాలు, వేములవాడలో 10,366 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,150 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. సాగైన పంటల ప్రకారం రైతుబంధు అందిస్తారని రైతులు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 11 విడతలుగా రైతుబంధు అందించగా గత యాసంగిలో లక్షా 29 వేల 407 మందికి 260.20 కోట్ల రూపా యలు అందించారు.

43,773 మంది రైతులకు రూ. 346.16 కోట్ల మాఫీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రూ 2 లక్షల రుణమాఫీని మూడు విడతల్లో పూర్తి చేసింది. జిల్లాలో 43,773 మంది రైతు ఖాతాల్లో రూ 346.16 కోట్లు జమ చేశారు. జిల్లాలో 65 వేల మంది రైతుల రుణాలు తీసుకున్న వారు ఉన్నారు. ఇందులో కొంత మంది అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో అందుకోలేక పోయారు. రుణమాఫీలో మొదటి విడతలో 23,907 మంది రైతులకు రూ 136.04 కోట్లు, రెండో విడతలో 12,202 మంది రైతులకు రూ 117.76 కోట్లు, మూడో విడతలో 7,783 మంది రైతులకు రూ 93.04 కోట్లు జమ చేశారు. మాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఇంటిం టి సర్వేను వ్యవసాయ అధికారులు నిర్వహిస్తు న్నారు. ఇదే క్రమంలో సాగు లెక్క తేలడంతో రైతు భరోసా కూడా వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెడితే చర్యలు: ఎస్పీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 5: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ ఇక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన వాటిలో మతవిద్వేషాలకు సంబంధించిన ఫేక్ మెసేజ్‌లు వీడియోలు, ప్రజలెవరూ పోస్టులు పెట్టవద్దని, ఫార్వర్డ్ చేయవద్దన్నారు. ఒకవేళ ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘించి ఫార్వార్డ్ చేసినా, పోస్ట్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ ఎలాంటి ఉద్వేగాలకు లోను కాకుండా సంయమనం పాటిస్తూ శాంతి భద్రతల సంరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని అయన కోరారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పాకాల శంకర్‌గౌడ్


మంత్రి పొన్నంతో పాకాల శంకర్ గౌడ్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాకాల శంకర్‌గౌడ్ గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాకాల శంకర్‌గౌడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంగౌడ్ సన్మానించి అవార్డును అందించారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందిస్తాం

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

వేములవాడ, సెప్టెంబరు 5: ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ రాజేశ్వర్ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం-2025లో భాగంగా గురువారం నాడు ఆయన వేములవాడలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల సవరణకు సంబంధించిన కార్యక్రమాలపై బూత్ స్థాయి అధికారులతో చేపట్టిన ఇంటింటి సర్వే 48 శాతం పూర్తయిందని వెల్లడించారు.

సర్వేలో ఫామ్ నంబర్ 6, 7, 8లపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల లోకేషన్ మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వారితో చర్చించారు. ఓటర్ల జాబితా రూపొందించేంతవరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో వరుసగా సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎన్నికల నాయబ్ తహసీల్దార్ శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ తరఫున పొలాస నరేందర్, కాంగ్రెస్ తరఫున వి నిత్యానందరావు, బీజేపీ తరఫున పిన్నింటి హన్మాండ్లు, తెలుగుదేశం పార్టీ తరఫున రామస్వామి గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా తుంగ, పిచ్చి చెట్లపై పిచికారి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలోని ఖాళీ స్థలాలో మొలచిన తుంగ, పిచ్చి చెట్లపై గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో అధికారులు డ్రోన్ ద్వారా గడ్డి మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణంలోని చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలతో తుంగ, పిచ్చి మొక్కలు పెరగడం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి కాలనీ వాసులు అనారోగ్యాల భారిన పడుతున్నారన్నారు.

తుంగ, పిచ్చి చెట్లు తొలగించలేని పరిస్థితులు ఉన్న ఖాళీ స్థలాల్లో గడ్డి మందు డ్రోన్ ద్వారా పిచ్చికారి చేసి వాటిని తొలగించడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మున్సిపల్ శానిటేషన్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ హమాలీలకు బకాయిలు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 5: సివిల్ సప్లయిస్ హమాలీలకు గత ఒప్పందం ప్రకారం జనవరి 2024 నుంచి రేట్లను పెంచడంతోపాటు బకాయిలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోపాటు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాల ఒకసారి హమాలీ రేట్లు పెంచేందుకు అంగీకరించి జీవోను విడుదల చేసి ప్రతి రెండు సంవత్సరాల ఒకసారి రేట్లను రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసి పెంచుతుందన్నారు. గత ఒప్పందం ప్రకారం ఈ సంవత్సరం జనవరి నుంచి కొత్త రేట్ల ఒప్పందం జరగాల్సి ఉందని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకోనిపోయి హమాలీకు రేట్లు పెంచాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్ల క్వింటాల్‌కు 26 రూపాయల నుంచి 35రూపాయలకు పెంచాలన్నారు. 350 కిలోల బెల్స్ బండల్‌కు ఒక్కటికి ఎగుమతి, దిగుమతికి 200 రూపాయలు పెంచాలన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించి హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. బోనస్ 6500 రూపాయల నుంచి పదివేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ పొందిన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ సౌకర్యం కల్పించడంతోపాటు హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, పండుగ పోచమల్లు, పండుగ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

చందుర్తి, సెప్టెంబర్ 5: కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతోపాటు ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి అధ్యాపకులు ఎలా బోధిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సహ పాఠ్యాంశాలు బోధించాలన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చేలా చూడాలన్నారు. కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. శ్రీనివాస్‌ను శాలువాతో ఇన్చార్జి ప్రిన్సిపల్ కృపాకర్, అధ్యాపకులు సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బోయినపల్లి, సెప్టెంబరు 5: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని రిటైర్డ్ ఎంఈవో రామరాజు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్, ఉత్తమ ఉపాధ్యాయులతో విప్, కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 5: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అదిశ్రీనివాస్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌లోని సమావేశమందిరంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 26 మందిని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అయన ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఎంతో కష్టపడితేనే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వస్తుందన్నారు. నేటి విద్యార్థులను రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి అన్నిచర్యలు తీసుకుంటుందని అన్నారు. ఖాళీలు భర్తీకి ఇటీవల దాదాపు 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలను నిర్వహించిందని గుర్తుచేశారు. పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకోని 10 జీపీఏలను సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్మానించారన్నారు. ప్రభుత్వం, సీఎం ఉపాధ్యాయుల పదోన్నతులు కల్పించడం తోపాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రపతి , శాస్త్రవేతలు, కలెక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగిన వారు ఉన్నారని గుర్తుచేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను స్వీకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి అవార్డు ఎంపికైన తాడూరి సంపత్‌కుమార్, రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన పాకాల శంకర్‌గౌడ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత ను వెలికితీసు వారు ఎంచుకున్న రంగంలో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సందీఫ్‌కుమార్ ఝా మాట్లాడూతూ తన బాల్యం నుంచి ఈ స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులందరికి కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను అన్ని అంశాలల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక పర్యావరణస్పృహ నైతికత విలువలు పోటీతత్వం నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళాచక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జీసీడీవో పద్మజ, ఎంఈవోలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, దాడి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంతో పాటు నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ప్లకార్డులను పట్టుకోని నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసి దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంటరీ కో- కన్వీనర్ అడెపు రవీందర్, బర్కం నవీన్‌యాదవ్, గాజుల సదానందం, మ్యానరాంప్రసాద్, రమేష్‌చారి, చొప్పదండి శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, గుడ్ల సురేష్, గాజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: సీఐ


మాట్లాడుతున్న సీఐ మొగిలి

ముస్తాబాద్, సెప్టెంబరు 5: గణేశ్ ఉత్సావాలను నిర్వాహకులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారం ఎస్సై సీహెచ్ గణేశ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేశ్ ఉత్సావాలను నిబంధనలకు లోబడి నడుచుకొని శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. డీజే సౌండ్‌ను వియోగించవద్దన్నారు. నిమజ్జన ఉత్సావాల రోజున ఒకదాని వెంట ఒకటి వెళ్లాలని నిర్ణీత సమయంలో నిమజ్జనం చేయాలన్నారు. భక్తి శ్రద్ధలతో ఉత్సావాలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గణేశ్, పండితుడు హరీశ్‌పంతులు, అఖిల పక్షం నాయకులు గజ్జెల రాజు, ఎద్దండి నర్సింహరెడ్డి, ఎలుసాని దేవయ్య, కొండం రాజిరెడ్డి, నల్ల నర్సయ్య, కార్తీక్‌రెడ్డి, నాని, కోల కృష్ణ, మిరుదొడ్డి భాను, మిరుదొడ్డి యాదగిరి, యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేత

చందుర్తి, సెప్టెంబర్ 5: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కరాలను మున్నూరు కాపు యువజన విభాగం అధ్యక్షుడు పెరుక గంగరాజు గురువారం అందజేశారు. 2023-24 సంవత్సరంలో పదవ తరగతిలో 80 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ముప్పిడి సాత్విక, చింతపంటి మనస్విని, చిట్యాల వైష్ణవిని అభినందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రతిభా పురస్కారం, ప్రశంసా పత్రం, చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగిత్యాల రాజు, పెరుక బాబు, మామిడాల రాజు, శీలం స్వామి, శీలంరెడ్డి, లోలపు చంద్రమోహన్, పెరుక లస్మయ్య, మామిడాల దేవయ్య, శ్రీనివాస్, చింతపంటి అజయ్, నక్క గంగాధర్, శీలం సత్తయ్య, ప్రకాష్, పెరుక రాజయ్య, చిట్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా


మట్టి గణపతులను ప్రదర్శిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 5: వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరూ మట్టి గణపతి విగ్రహాలను ఏర్పటు చేసుకోని పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడెందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధ్వర్యంలో తయారు చేసిన 2వేల మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు గ్రామాల్లో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాలని సూచించారు. పర్యావరణ, పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈభిక్షపతి, జీఎం ఇండస్ట్రీస్ భారతి తదితరులు పాల్గొన్నారు.

● సదరమ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

సిరిసిల్ల కలెక్టరేట్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటు చేస్తున్న సదరమ్ శిబిరాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సదరమ్ శిబిరంలో వైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం మీసేవా ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత సమయానికి రావాలన్నారు. ఈ శిబిరంలో ఆర్థో, వినికిడి, కంటి, మానసిక అనారోగ్యం శిబిరాలు నిర్వహించే ఏర్పాట్లుపై చర్చించారు. ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రభుత్వం ఆసుపత్రుల్లో ఈ నెల 10, 13, 18, 20 వ తేదీల్లో నిర్వహిస్తామన్నారు. కంటి వైకల్యం నిర్ధారణ పరీక్షలు సిరిసిల్ల, వేములవాడ ఆసుపత్రుల్లో ఈ నెల 24న నిర్వహిస్తామన్నారు. వినికిడి, మానసిక అనారోగ్య వైకల్యం నిర్ధారణ పరీక్షలు ఈ నెల 27న నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదరమ్ శిబిరాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిరిసిల్ల ఆసుపత్రిలో నిర్వహిస్తామని తెలిపారు. వేములవాడు ఏరియా అసుప త్రిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు నిర్వహిస్తా రని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ అసుపత్రుల సూపరింటెండెంట్‌లు లక్ష్మీనారాయణ, పెంచలయ్య, ఆర్ఎంవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోతి దాడిలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 5: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన బొజ్జ కొంరయ్యపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్య కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. గురువారం ఇంటి బయట వరండా మీద ఫిజియోథెరపీ చేసే క్రమంలో కోతుల గుంపు దాడి చేసింది. గాయపడిన కొంరయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

● కాలంచెల్లిన తినుబండారాల గుర్తింపు

కొడిమ్యాల, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని ఐదు హోటళ్లను గురు వారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనూష తనిఖీ చేశారు. కాలంచెల్లిన కూల్ డ్రింక్స్, తిను బండారాలను గుర్తించి వాటిని బయట పడేయించారు. తినుబండారాలను ఎల్లపుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. కాలం చెల్లిన వాటిని అమ్మకానికి పెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో సిబ్బంది ఉన్నారు.


కాలం చెల్లిన కూల్ డ్రింక్ పారపోస్తున్న సిబ్బంది

జోరుగా రేషన్ బియ్యం దందా

● గ్రామాల్లో అక్రమంగా కొనుగోళ్లు

మల్యాల, సెప్టెంబరు 5: పేదల కడుపునింపడానికి ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. చౌకధరల దుకాణాల ద్వారా నాలుగేళ్లుగా ఉచితంగా అందిస్తున్న బియ్యం కొందరు అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ తతంగం మండలంలో కొన్నేళ్లుగా సాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెల మొదటి వారంలో రేషన్ దుకాణాలలో ఆహారభద్రత కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా అదే రోజు నుంచి కొందరు వ్యక్తులు కొనుగోళ్లు చేస్తున్నారు. కొందరు బినామీలు బృందాలను ఏర్పాటు చేసుకొని కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10నుంచి 15వరకు చెల్లిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం గుట్టుచప్పుడు కాకుండా కొనుగోళ్లు చేసిన వ్యక్తులు ఇప్పుడు నేరుగా బియ్యం కొనడం.. తాము ప్రతి నెలా సంబంధిత అధికారులకు మాముళ్లు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అందుకే యథేచ్ఛగా కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ దందా సాగుతోంది.

● రేషన్‌దుకాణాల వద్దే కొనుగోళ్లు

బియ్యంను రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా అక్రమంగా కొనుగోళ్లు చేసే వ్యక్తులు పంపిణీ రోజుల్లో అక్కడే మకాం వేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద క్వింటాళ్ల కొద్ది అక్కడే కొనుగోలు చేసి కొండగట్టు తదితర ప్రాంతాల్లో నిలువ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి వ్యాపారులు కొందరు పెద్ద వ్యాపారులకు రూ.20కి అప్పజెప్పుతుండగా మహారాష్ట్రకు తరలించి కిలోకి రూ.25-30వరకు విక్రయిస్తున్నట్లు గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యక్తులు తెలుపుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంలో సగానికిపైగా అక్రమంగా తరలిస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


గ్రామంలో ద్విచక్రవాహనంపై బియ్యం తరలింపు

కోర్టు ఆదేశాలతో షటర్లు, ప్రహరీ కూల్చివేత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో అక్రమంగా సెల్లార్లలో షెటర్లు నిర్మించారని కొందరు కోర్టుకు వెల్లగా కోర్టు ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భవనం సెల్లార్లలో నిర్మించిన షెటర్లు, ప్రహరీని కూల్చి వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సబంధించిన భవనం సెలార్లలో షెటర్లు, భవనం పడమర వైపు బాత్‌రూంలు కట్టడంతో ఓ న్యాయవాది కోర్టుకు వెళ్లారు. బాత్‌రూం షెటర్లు, ప్రహరీని తొలగించాలని కోర్టు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పాక్షికంగా కూల్చి వేశారు.


సెల్లార్‌లోని షెటర్లను తొలగిస్తున్న జేసీబీ

నామమాత్రంగా కూల్చారు : బీజేపీ

మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు సంబంధించిన భవన సెల్లార్‌లోని బాత్‌రూం, షెటర్లు, ప్రహరీని కూల్చాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా కూల్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు. భవనం పడమర వైపు ఉన్న సెల్లార్లో నిబంధనలకు విరుద్ధంగా బాత్‌రూంలు నిర్మించారని కోర్టుకు ఓ న్యాయవాది వెళ్లగా వాటిని తొలగించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన వాటిని మాత్రం మున్సిపల్ అధికారులు కూల్చలేదని ఆరోపించారు. 24 గంటల్లో కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్రవాహనాలు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ -రగుడు ప్రధాన రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జగిత్యాల, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాలకు చెందిన తాటి సంతోష్, సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలకు చెందిన తాటి సంతోష్ తన బైక్‌పై వెంకటాపూర్ నుంచి రగుడు వైపునకు వెళుతున్నాడు. గండిలచ్చపేటకు చెందిన సతీష్ తన ద్విచక్ర వాహనంపై అతని భార్యతో కలిసి రగుడు నుంచి వెంకటాపూర్‌కు వస్తున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సంతోష్, సతీష్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్‌కు తీవ్ర గాయాలుకావడంతో పరిస్థితి విషమంగా మారింది.

జ్వరంతో ఒకరి మృతి

రుద్రంగి, సెప్టెంబరు 5: రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి (52) అనే వ్యక్తి జ్వరంతో గురువారం మృతి చెందాడు. నోముల రవి 10 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం వేములవాడ తీసుకువేళ్లే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

లంచం ఇవ్వనందుకు ఉద్యోగం నుంచి తీసేశారు

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహిళా అటెండర్ నిరసన

గన్నేరువరం, సెప్టెంబరు 5: ఉద్యోగంలో కొనసాగాలంటే లంచం ఇవ్వాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ గన్నేరువరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఎడ్ల లక్ష్మి గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా తాను అటెండర్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నానని, ఇపుడు జీతం పెరగడంతో ఎంపీడీవో తీగల శంకర్, ఏపీవో స్వాతి రూ. 40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. లంచం ఇవ్వనందుకు తనను ఉద్యోగం నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరుపేదనని, డబ్బులు ఇవ్వలేనని వేడుకున్నప్పటికీ ఉద్యోగానికి రావద్దని నెల రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి లంచం అడిగిన అధికారులపై చర్యలు తీసుకొని తన ఉద్యోగాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని లక్ష్మికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది.


పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న ఎడ్ల లక్ష్మి

వరదకాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

రామడుగు, సెప్టెంబర్ 5 : మండలంలోని షానగర్‌లోని వరద కాలువలో గురువారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పుల్లెల వెంకటమ్మ(82) ఈ నెల 3న ఇంటి నుంచి బయటికి వెళ్లింది. షానగర్ గ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షానగర్‌లోని వరద కాలువ వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వయోభారంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు పుల్లెల శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 5: ద్విచక్రవాహనం, బులెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ నంది కమాన్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాలరామన్నపల్లి గ్రామానికి చెందిన కదురు నరేష్ అనే వ్యక్తి తన బంధువు అయిన తంగళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. ఇదే క్రమంలో బులెరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో నరేష్, హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి. హర్షవర్ధన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ తరలించినట్లు తెలిపారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	74,837	8,867	80.5	74.837
ఎల్లంపల్లి	1,65,579	1,02,496	20.175	16.463
మిడ్ మానేరు	16,550	6,400	27.54	22.804
ఎల్ఎండీ	7,546	290	24.034	19.76
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

శ్రీరాంసాగర్ వరద గేట్లు మూసివేత

● ప్రాజెక్టులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం శ్రీరాంసాగర్ వరద గేట్లను అధికారులు మూసివేశారు. నాలుగు, అయిదు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన 41 వరద గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. క్రమక్రమంగా వరద రావడం తగ్గుముఖం పట్టడంతో ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుకు చెందిన వరద గేట్లన్నింటినీ మూసివేశారు. వరద కాలువకు సైతం నీటిని వదలడాన్ని క్రమక్రమంగా తగ్గించారు. ఎస్సారెస్పీలోకి 74,837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.837 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,65,579 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 20 గేట్ల ద్వారా 1,02,496 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.4 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 15,000 క్యూసెక్కులు మూల వాగునుంచి, మానేరు వాగు ద్వారా 1,550 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్ఎండీకి నీటి విడుదలను నిలిపివేయగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.07 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 22.804 టీఎంసీల మేరకు చేరుకొంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 2.96 టీఎంసీలకు చేరుకుంది. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు


ధర్మపురిలో స్నానఘట్టాల వద్ద గోదావరి ప్రవాహం

20 టీఎంసీలకు చేరువలో ఎల్ఎండీ


ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీరు

తిమ్మాపూర్: నిరంతరంగా కురుస్తున్న వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం 20 టీఎంసీల నీటి మట్టానికి చేరుకుంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసిలకు 19.76టీఎంసిల నీరు ఉంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మోయతుమ్మెద వాగు ఉధృతి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఎల్ఎండిలోకి మోయతుమ్మెద వాగు నుంచి 5,715క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 1831క్యూసెక్కులు మొత్తం 7,546క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, అవుట్ ఫ్లో 290క్యూసెక్కులు ఉంది. ఎంఎంఆర్ నుండి ఎల్ఎండిలోని వస్తున్న ఇన్‌ఫ్లోలను గురువారం నిలిపివేశారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం గురువారం సాయంత్రం వేగంగా కొనసాగింది. గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవహించింది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్(ఫైల్)

సైదాపూర్, సెప్టెంబరు 5: సైదాపూర్ మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన మెడవేణి ప్రవీణ్(25) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసే సరికి ప్రవీణ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

రాజన్న భక్తురాలి ఆకస్మిక మృతి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: కుటుంబ సమేతంగా రాజన్న దర్శనానికి వచ్చిన కొత్తకొండ విజయ (52) అనే భక్తురాలు గురువారం మృతి చెందారు. రాజన్న దర్శనానికి వచ్చి దర్శించుకుని గదిలోకి వెళ్లే క్రమంలో ఆలయ పరిసర ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే బంధువులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ రాజన్న దర్శనం కోసం కుటుంబసమేతంగా వచ్చారు. మృతురాలది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చోటపల్లి గ్రామం అని తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాపింగ్

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 5: అధికారులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు కరీంనగర్ సీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ శాసనసభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడని, అందులో మానకొండూర్ సీఐకి సీపీ టెలీకాన్ఫరెన్స్ రావడం లేదని, సీఐతో సీపీ మాట్లాడటం లేదని చెప్పారన్నారు. టెలీకాన్ఫరెన్స్ అనేది ఒక ఇంటర్నల్ విషయమని, అలాంటి విషయం ఎమ్మెల్యేకు ఎలా తెలిసిందో సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలోని అందరి అధికారుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్నారు. ఒక ఐపీఎస్ ఫోన్ ట్యాప్ చేసినపుడు ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్ చేయడం లేదని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. తాము పోస్టింగ్‌లు ఇప్పిస్తే సీపీ తీసుకోవడం లేదని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పైరవీలకు తావు లేదని చెప్పాడని, అలాంటపుడు పోస్టింగ్‌లు ఎలా ఇప్పిస్తున్నారో చెప్పాలన్నారు. ఓడిపోయిన వ్యక్తి ఇక్కడ చెక్కులు పంచుతున్నాడన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఏ చెక్కు అయినా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేలకు హక్కు ఉంటుందన్నారు. అవసరమైతే తాను మళ్లీ వెళ్తా అన్నారు. సీపీ ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగలేదని, కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లు ప్రవేశపెట్టాలి

● యాదగిరి శేఖర్ రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 5: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సంక్షేమ బిల్లును వెంటనే పార్లమెంట్, అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా, మరో 10 లక్షల రూపాయల జీవిత బీమాను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించే విద్యార్థుల్లో 90శాతం విద్యార్థులు బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో నుంచి వస్తున్నారని అన్నారు. భావి భారత పౌరులను దేశానికి అందిస్తున్నది కూడా బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా గౌరవించి సముచిత స్థానం ఇవ్వాలని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారు మైసమ్మ చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ 14,970 నగదుతో పాటు పేకాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రానికి చెందిన యువకులు అఖిల్, ఖాసీంలను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ శివారులో ఈ నెల 4న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారని పేర్కొన్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై అనుమానస్పదంగా సంచరిస్తుండగా పట్టుకుని విచారించామని చెప్పారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. అఖిల్, ఖాసీంలు గంజాయికి అలవాటు పడి గంగాధర మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలోని యువకుడు మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తమ విచారణలో అంగీకరించారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారెల్లి నాగరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి తీవ్రంగా మారింది. గ్రామంలోని రైతు మారెల్లి నాగరాజు తనకున్న వ్యవసాయ పొలం వద్ద నుంచి పాడిగేదెలను పశువుల పాక వద్దకు ప్రధాన రహదారి పక్క నుంచి తీసుకెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వైపుకు వెళ్తున్న ఆటో అతివేగంగా నాగరాజును వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆయన ఎగిరి రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయాలవడం వల్ల పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

శనివారం కల్యాణం, అభిషేకం పూజల రద్దు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి 15వ తేదీ ఆదివారం వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఆలయ నాగిరెడ్డి మండపంలో ఉదయం 9.05 గంటలకు పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, సిద్ధి బుద్ధి వినాయక ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి రోజున సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానము చేపట్టనున్నారు. 14వ తేదీన భాద్రపద శుద్ధ ఏకాదశి శనివారం రోజున ఉదయం 9 గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనము, సాయంత్రం 7.15 గంటలకు లక్ష్మీగణపతి స్వామి వారికి మహాపూజ, 15వ తేదీన భాద్రపద శుద్ధ ద్వాదశి ఆదివారం రోజున హవనానంతరం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు పెద్దసేవ ఊరేగింపు అనంతరం గణేశ నిమజ్జనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా వినాయక చవితి సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో నిర్వహించే కల్యాణాలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,సెప్టెంబరు 5: మండలంలోని తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని కొనుగోలు చేసి తుంగూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉంచాడు. పోలీసులకు అందిన సమాచారంతో సోదాలు నిర్వహించి 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితుడు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

దంపతుల మధ్య మనస్పర్థలు

● అత్తగారింటిలో వివాహిత బైఠాయింపు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: భార్యభర్తల మధ్య మనస్పర్థల వల్ల కొంతకాలంగా విడివిడిగా ఉంటుంటగా, భార్య నుంచి విడాకులు కావాలని భర్త కోర్టును ఆశ్రయించడంతో పుట్టింటి నుంచి చేరుకున్న వివాహిత అత్తగారింటిలో బైఠాయించింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు. గ్రామంలోని ఆంజనేయులుకు బోయినపల్లి మండలం బూరుగుపల్లికి చెందిన కల్యాణితో వివాహమైంది. కొంత కాలం సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు నెలకొన్నాయి. దాంతో కల్యాణి నాలుగేళ్ల కిందట పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని సూచించినా ఫలితం లేకుండాపోయింది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవలతో కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో భర్త ఆంజనేయులు తన భార్య నుంచి విడాకులు కావాలని నోటీసులు పంపించడంతో కల్యాణి పుట్టింటి నుంచి వెంకటాపూర్‌లోని అత్తగారింటికి చేరుకుంది. తాను ఇక్కడే ఉంటానని భీష్మించుకు కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గొడవలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోంది..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో హైడ్రా పేరుతో డ్రామా నడుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. 90 ఏళ్ల క్రితం నైజాం పాలనలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించారని, అప్పటి నుంచి నేటివరకు ఆ విధంగా సర్వేలు నిర్వహించలేదన్నారు. రెవెన్యూ చట్టంలో మొదటి ఎజెండాగా సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించాలని ఉందని, ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూ కమిటీని వేశారని, కమిటీ సభ్యులను కలిసి సర్వే విషయమై వినతిపత్రం అందించామన్నారు. రికార్డులు సరిచేస్తామని చెప్పడమే తప్ప చేపట్టడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న హైడ్రాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలన్నారు. అక్రమ కట్టడాల్లో ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఉన్నారని, వారి నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికయ్యారన్నారు. సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, దీంతో అక్కడ నిర్మించిన కట్టడం అక్రమమని తేలితే ఆధారాలతో కూల్చేస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుశిఖం, నాలా వంటి భూములను ఆక్రమిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని, అందులో కూడా పేద కుటుంబాలు ఉంటాయని వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు కట్టించాలన్నారు. 2లక్షల రుణమాఫీ విషయంలో ప్రతి రైతుకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడికొండ ఒడెమ్మ, పోడం స్వామి, సూర్య పాల్గొన్నారు.


పెద్దబొంకూరులో విలేకరులతో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సైబర్‌క్రైం కేసు నమోదు

బోయినపల్లి, సెప్టెంబర్ 5: ఓ వ్యక్తికి చెందిన కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు తీసుకొని ఎక్కువ మొత్తంలో బ్యాంక్ ద్వారా లావాదేవీలు జరిపిన సంఘటనపై ఖాతాదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గురువారం బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల కిషన్ అతని కరెంట్ అకౌంట్ సిమ్ కార్డు గుర్తుతెలియని వ్యక్తి తీసుకొని పెద్ద మొత్తంలో లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తిచే కరెంట్ అకౌంట్ ఓపెన్ చేయించి గుర్తుతెలియని వ్యక్తులు లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంభీరావుపేట సెప్టెంబరు 5: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కందుకూల నవీన్ (27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్లారెడ్డిపేటకు చెందిన నవీన్ 22 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఉత్సాహంగా తీజ్ సంబరాలు

● తొమ్మిది రోజుల పాటు బంజారాల వేడుక


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు


సిరిసిల్లలోని కళాశాల మైదానంలో సంబరాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచార వ్యవహారాలే ప్రాణంగా బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాలను ఆటపాటలతో గిరిజనులు ఎంతో సంబురంగా జరుపుకున్నారు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుపుకొని చివరిరోజు మానేరు తీరం వరకు తీజ్ నిమజ్జనం చేశారు. బతుకమ్మ తరహాలో జరిగే తీజ్ వేడుకలు తొమ్మిది రోజుల పాటు నాలుగు దశలుగా జరుపుకున్నారు. మొదటగా తీజ్ బోరా యేరో బుట్టల్లో గోధుమలను చల్లడం, రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం, మూడవది గన్‌కోర్ అంటే మేరామా, సేవాలాల్‌ల పెండ్లి, నాలుగోవది గోధుమ నారును చెరువులో వదలడం వేరా యేరోగా పిలిచే వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బుట్టలతో గిరిజన యువతులు, మహిళలు ఆటలు, పాటలతో నృత్యాలు చేస్తూ వెళ్లారు. నానబెట్టిన బుట్టల్లో పెరిగిన గోదుమ నారు ను అన్నదమ్ములకు పంచారు. వైభవోపేతంగా జరుపుకున్న తీజ్ వేడుకల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, సీఐ కృష్ణ, వీర్నపల్లి మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, రైతు బంధు సమితి మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు ఉత్సవాల్లో పాల్గొని గిరిజను లకు శుభాకాంక్షలు తెలిపారు. ఖీమ్యానాయక్, కేకే మహేందర్‌రెడ్డిల బంజారాలు తమ ఉత్సవాలు జరుపుకోవడానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, దేవ్ సింగ్, గజన్‌లాల్, తిరుపతి, కేపతి, వినోద్, జేత్యా, భూపతి ఉన్నారు.


తీజ్ బుట్టలతో యువతులు

పోడు భూముల కేసులను ఎత్తివేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 5: పోడు భూముల పోరాటాల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులను రాష్ట్రప్రభుత్వం ఎత్తివేసి అర్హులైన వారందరికి పోడు పట్టాలను అందించాలని ప్రజా సంఘాల నాయకుడు మాల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతుల పక్షాన నిలబడి పేదలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టు తిప్పించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోడు రైతుల పక్షాన నిలబడిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సాగు చేసుకునే అవకాశం కల్పించి హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జూలపల్లి మనోజ్‌కుమార్, ఇసంపెల్లి కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● హక్కు పత్రాలను అందించాలి

పోడు భూముల హక్కు పత్రాలు అందించడంతో పాటు పోరాటం చేసిన నాయకులు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసి కోర్టుల నుంచి విముక్తి కల్పించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్‌నాయక్ డిమాండ్‌చేశారు. 2005 నుంచి 2022 వరకు గిరిజనులపై పెట్టిన పోడు భూ ముల కేసులను ఎత్తివేస్తామని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. కేసులతో గిరిజన రైతులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోడు రైతులు రాజునాయక్, జగన్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, ఇందల్ రాథోడ్, ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా తరహాలో గ్రామాల్లోనూ చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 5: చెరువులను కాపాడటమే లక్ష్యంగా కొనసాగుతున్న హైడ్రా తరహాలో గ్రామాలలోను చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడుతు రాబోవు తరాల ప్రజలు ఇబ్బందులు పడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సహాసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. గ్రామాలలోను చెరువు, కుంటల శిఖం భూములను పలువురు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. అధికారులు వీటిపై విచారణ చేపట్టాలని కోరారు. ఇల్లంతకుంట మండలంలో దాదాపు 75చెరువులు ఉన్నాయని, వీటిలో అనేక మంది ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎమ్‌సీ ఉపాధ్యాక్షుడు ఎలగందుల ప్రసాద్, నాయకులు తాట్ల వీరేషం, జమాల్, సోషల్‌మీడియా కన్వీనర్ బెజ్జంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 5: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యార్థులకు అపోల ఆసుపత్రి గుండె సంబంధిత వైద్యులు ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే టీంలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య శిబిరాల ద్వారా గుర్తింప బడిన గుండె సంబంధిత వ్యాదులతో బాధపడే విద్యార్థులకు డిస్ట్రిక్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్(డీఈఐసీ)లో ప్రత్యే వైద్య పరీక్షలను నిర్వహించారు. అందులో 18 మంది విద్యార్థులకు శస్త్ర చికిత్సలు అవసం ఉందని, మరి కొందరు విద్యార్థులకు మందులతో వ్యాధిని తగ్గించడానికి అవకాశం ఉందని గుర్తించారు. విద్యార్థులందరిని ఒక సంవత్సరం వరకు వైద్యుల పర్యావేక్షణలో మందులతో పరిశీలుస్తుండాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్, వైద్యురాలు నయిమ్ జోహాన్, వైద్యులు, ఫార్మసిస్టుల, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆదర్శ ఉపాధ్యాయుల నిరసన

తంగళ్లపల్లి, సెప్టెంబరు 5: తంగళ్ళపల్లి మండలం మండేపల్లి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 21 రోజులుగా భోజన వివరాలను సమయంలో నిరసన చేస్తున్నట్లు తెలిపారు. 010 పద్దు ద్వారా వేతనాలు ఒకటవ తేదీ నాడు చెల్లించాలని, ప్రమోషన్స్, బదిలీలు చేయాలని, హెల్త్‌కార్డులు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేష్, చంద్రశేఖర్, బాలరాజు, అంజయ్య, శోభారాణి, రేణుక, జ్యోతి,సరిత, ప్రభాకర్, శివకుమార్ రెడ్డి, కవిత, సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, జిశ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

గంభీరావుపేట సెప్టెంబరు 5: గంభీరావుపేట మండలం కొత్తపల్లి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్ర శివసేన అధికార ప్రతినిధి గౌటే గణేష్ కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శిలాజినగర్ గ్రామసరిహద్దు వరకు దాదాపు మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా గుంతలమయంతో ప్రయాణికులు వెళ్లలేని పరిస్థితిలో ఉందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాదులో అందజేసిన వినతి పత్రంలో గౌడ్ గణేష్ కోరారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు పరిస్థితిని చాలాసార్లు పాలకులకు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడంతో ఆందోళనలు నిరాహార దీక్షలు చేపట్టిన విషయాన్ని గౌట్ గణేష్ మంత్రి దృష్టికి తెచ్చారు. మూడు కిలోమీటర్ల పొడవున డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు అందజేసిన వినీత్ పత్రంలో గౌటే గణేష్ కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: సీఐ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, సెప్టెంబరు 5: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొలనూరు గ్రామంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను నియంత్రించడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అబ్దుల్ రషీద్, నిరంజన్ రావు, తాళ్లపల్లి సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

వీర్నపల్లి, సెప్టెంబరు 5 : విద్యార్థులు పాఠశాల దశలోనే లక్ష్యంతో చదవాలని ఐపీఎస్ భూక్య రాంరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సొంత గ్రామంలోని పాఠశాలలో ఆయన చదివిన జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. తను చిన్నప్పటి నుండి గర్జనపల్లితో పాటు ఆయా గ్రామాలను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంజిత్ కుమార్, రాకేష్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామివారి దేవస్థానంలో టెండర్లకు ఆహ్వానం

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లడ్డు, పులిహోర ప్రసాదం అమ్ముకోవడానికి, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోవడానికి టెండర్, బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని దేవస్థానం ఈవో డి మారుతీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 9 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో లడ్డు, పులిహోర ప్రసాదం అమ్ముకోవడానికి రూ 10 వేలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోవడానికి రూ 10 వేలు డిపాజిట్ చేయాలని ఈ నెల 19, 20 తేదీల్లో రూ. 200 చెల్లించి టెండర్ ఫారం పొందవచ్చని తెలిపారు. 20న టెండర్ బాక్స్‌లో వేయాల్సి ఉంటుందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, సెప్టెంబరు 5: చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన జువ్వాడి సత్యనారాయణరావు కుటుంబ సభ్యులను, మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్యను, లింగంపేటలో కూతురు జన్మించి మృతి చెందడంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దప్పుల అశోక్‌ను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అయన వెంట సింగిల్‌విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, చిలుక అంజిబాబు, మరాఠి మల్లిక్, జువ్వాడి అనిల్ రావు, రమేష్ రావు, బాబు, వెంకటేష్, రవి, గంగాధర్, కమలాకర్, నగేష్, రమేష్ రావు తదితరులు ఉన్నారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చందుర్తి, సెప్టెంబరు 5: చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బండపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు గడ్డం రణధీర్‌రెడ్డి గురువారం తెలిపారు. బండపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 591 లో కిష్టంపేట గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు 5 ఎకరాల 11 గుంటల భూమి ఉండగా, పహానిలో ఓ మహిళ పేరు ఎక్కించి అదే సర్వే నెంబర్‌లో అదనంగా 2 ఎకరాల 37 గుంటల భూమిని మరో వ్యక్తికి విక్రయించినట్లు తెలిపాడు. సర్వేనెంబర్ 592లో 2 ఎకరాల గ్రామపంచాయతీ చెందిన భూమిలో మహిళ పేరు చేర్చారని ఆరోపించారు.

సర్వే నంబర్‌లో అదనంగా భూమి ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయరాదని, అధికారులు రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. పాత పహానీల్లో పెన్నుతోని కొట్టివేతలు ఉన్నాయని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
- ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు







వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, సుద్దాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నర్సింగాపూర్‌లో.

వేములవాడ, సెప్టెంబరు 5: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, కళాశాల అధ్యాపక బృందం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డీఐఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య, వస్తున్న ఫలితాలు సంతృప్తినిచ్చాయని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వెన్నంటే నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్ కుమార్, అధ్యాపకులు శేఖర్, మహేందర్, అశోక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, వాణీనికేతన్, పొత్తూరు గ్రామంలోని వివేకానంద, వల్లంపట్ల గ్రామంలోని కేరళమాడల్ పాఠశాల తదితర గ్రామాలలో గురువారం సర్వేపల్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరాజం, ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, తూముకుంట శ్రీనిధి, పండరీనాథ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, గుండారం, తిమ్మాపూర్, నారాయణపూర్, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులందరికీ గురువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గురువులందరికీ సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్‌లు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో, మహర్షి ఇంగ్లీష్ మీడియం, నవజ్యోతి, రాఘవేంద్ర, శ్రీవాణి పబ్లిక్ స్కూల్ సర్వేపల్లి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు గురువులను శాలువాతో సత్కరించి పూలమాలతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటగోపాల్, చారి, సత్యనారాయణ, అనిత, శారదదేవి, స్వరూప, ఉమారాణి, రమణ, రవీందర్, సుధ, ఉత్పల మాల, కెజె ప్రకాశ్, నరేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కేజీబీవీ ఉపాధ్యాయురాలు పద్మ, ఎంపీపీఎస్ రంగంపేట ఉపాధ్యాయుడు లచ్చిరెడ్డిలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం, కేజీబీవీ ఎస్ఓ నీలిమా, ప్రధానోపాధ్యాయులు తుమ్మ శ్రీనివాస్, వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సరస్వతి శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ నారాయణ, శుభోదయం స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రుద్రంగికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు శాలువలతో ఘనంగా సన్మనించారు.

అలాగే కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు శాలువలతో పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తిపిరెడ్డి వేంకట్ రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, మంచే రమేష్, పడాల సురేష్, ఎలిగేటి నరేష్, అంబటి శంకర్, గోడికారి హీరోజి, మరిపల్లి అంతయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ హరినాద్‌రాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాల ధర్మారం తదితర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఘనంగా ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు మురళి నాయక్, మంజుల, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్ కుమార్, కమిటీ సభ్యులు ఉప్పల ఆంజనేయులు, ఉపాధ్యాయులు కుమార్, రవి, భూమేష్, గంగాధర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య, నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాలతో పాటు నర్సింగాపూర్, అశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీయట్ విద్యాధికారి వై.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణాకర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుజాత, జితేందర్, రజిత, ఉపాధ్యాయులు ఈగ శ్రీనివాస్, నరేష్, స్వప్న, నల్ల భాగ్యలక్ష్మి, నర్మద, అశోక్ పాల్గొన్నారు.





గర్జనపల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్ఎంసి కమిటీ సభ్యులు, తంగళ్లపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

కోడెల కాళ్ల డెక్కల తొలగింపు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 5: వేములవాడ పట్టణంలో తిరుగుతున్న కోడెలు, ఆవుల కాళ్ల డెక్కలను పశువైద్యాధికారులు గురువారం తొలగించారు. వేములవాడ పట్టణంలో నిత్యం రోడ్లపైన తిరిగే కోడెలు, ఆవుల కాళ్ల డెక్కలు పెరిగి వాటికి నడిచేందుకు ఇబ్బందికరంగా మారింది. దీంతో గమనించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాళ్ల డెక్కలను తొలగించాలని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. దీంతో స్పందించిన కాంగ్రెస్ నాయకులు సుమారుగా 20 కోడెలు, ఆవులను ఒక్కచోటకి చేర్చి వాటికున్న డెక్కలను పశువైద్యాధికారులతో తొలిగించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వీరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, పుల్కం రాజు, అన్నారం శ్రీనివాస్, ఇప్పపూల అజయ్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్యానాయక్ తండాలో ఈ నెల 4న రాత్రి విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన ధరావత్ శంకర్ కుటుంబాన్ని తహసీల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి తహసీల్ అధికారులు నిత్యావసర సరుకులను అందజేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, బాబు, రాజయ్య, మోహన్‌రెడ్డి, బాలయ్య, సురేశ్, వెంకట్‌రెడ్డి, తహసీల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 5: ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని టీ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మెన్ బోగ శశిధర్, సెక్రటరీ జనరల్ గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల వర్షం నష్టాల దృష్ట్యా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ ప్రభుత్వానికి సహరించే రీతిలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఉద్యోగుల ఒక రోజు వేతనం 130కోట్లు విరాళాన్ని స్వయంగా సీఎం సమక్షంలో ప్రకటించారన్నారు. లచ్చిరెడ్డి జేఏసీ నాయకుడిగా, బాధ్యుడిగా పేర్కొంటూ వంద కోట్ల విరాళం తాను ఇప్పించను న్నట్లు ప్రకటన చేయడాన్ని జిల్లా జేఏసీ చైర్మన్లు, సెక్రటరీ జనరల్ ఖండించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బోయినపల్లి, సెప్టెంబరు 5: యువత మత్తు పదార్థాలకు దూరం ఉండి, ప్రాణాలు కాపాడుకోవాలని, అదేవిధంగా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థి దశ నుండే కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని బోయిన్‌పల్లి ఎస్ఐ దూలం పృథ్వీధర్ గౌడ్ అన్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్క యువకుడు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. డ్రగ్స్‌కు బానిస అయితే మీరు నాశనం అవడమే కాకుండా మీ కుటుంబాన్ని కూడా నాశనం చేసినవారు అవుతారని అన్నారు. సమాజంలో రోజు రోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని విద్యార్థులు జాగ్రత్తగా ఉంటూ వారి తల్లిదండ్రులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యులు గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది స్థానిక కిషన్‌దాస్‌పేట, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో సుమారు 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 17 మంది జ్వరంతో బాధ పడుతున్నారని గుర్తించారు. మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించారు. జ్వర పీడుతులకు మందులను పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రజిని, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామాల్లోనే వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డా. చిరంజీవి తెలిపారు. వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామంలో వైద్య సిబ్బందితో ఇంటింటా సీజనల్ వ్యాధుల సర్వే నిర్వహించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని బంజేరు, వీర్నపల్లితో పాటు ఆయా గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్ఎంలు మంజుల, ఇందిరా, కీర్తి, సుజాత, బ్రీడింగ్ చెక్కర్ గోవర్ధన్, ఆయా గ్రామాల పంచాయతీకార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట యునాని ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ కేంద్రములో ఉచిత వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పేషెంట్లకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, మోకాళ్ల, మెడ తదితర నొప్పులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమిని, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నీరటి తిరుపతి, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, యస్ఎన్ఓ సరోజ, పీటీయస్ యోనిస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ముస్తాబాద్, సెప్టెంబరు 5: అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ మాయామాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇంతవరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్య పెట్టిందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి

వేములవాడ, సెప్టెంబరు 5: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని వేములవాడ సీడీపీవో సౌందర్య అన్నారు. పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పలువురి ఇళ్లకు వెళ్లిన ఆమె పౌష్టికాహారం గురించి వివరించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

నియామకం

వేములవాడ టౌన్, సెప్టెంబరు 5: ఉద్యమకారుల అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా వరాల దేవయ్యను నియమించినట్లు గురువారం ఆ సంఘం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. వేములవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో కన్వీనర్లు, కో కన్వీనర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కో కన్వీనర్‌గా బొడ్డు నారాయణ, శంకర్, లక్ష్మీనారాయణ, శంకరయ్య, హన్మండ్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల్‌గౌడ్, బొజ్జ కనుకయ్య, బొడ్డు రాములు, పోశెట్టి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, సెప్టెంబర్ 5 మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాల వల్ల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు గురువారం పరామర్శించారు. అన్నవేని స్వామి, గడ్డం రాజం, ఎర్రం లక్ష్మి, నోముల రవి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, గంగం మహేష్, న్యాలకొండ రాఘవరెడ్డి ఉన్నారు.

పూర్తిస్థాయిలో పెద్దాపూర్ గురుకులం సమస్యల పరిష్కారం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అన్ని రకాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం గురుకుల పాఠశాలను పరిశీలించామన్నారు. పాఠశాలను బుధవారం పునఃప్రారంభించామని, విద్యార్థులు తరలివస్తున్నారన్నారు. గురుకులంలో ఇతర సమస్యలు, చేపట్టిన పనుల వివరాలు, కావాల్సిన వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గురుకులం కావాల్సిన వసతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పాఠశాలలోని తొమ్మిది, ఎనిమిదో తరగతులను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డీటీ రాజుమహ్మద్, ఆర్ఐ ఉమేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

మల్యాల, సెప్టెంబరు 5: మల్యాల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. ఆసుపత్రిలో మందుల కొరతపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆసుపత్రిలో ఫార్మసీ పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని మందులను రేపటిలోగా తెప్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు.

ఆశావర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలి



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 5 : దేశవ్యాప్తంగా పనిచేస్తున్న అశావర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయడంతోపాటు కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించాలని సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ ఆదేశాల మేరకు గురువారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సీఐటీయూ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆశాలు పదిలక్షల మంది 30 సంవత్సరాల నుంచి కమ్యూనిటి హెల్త్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారని అన్నారు. ఇందులో పనిచేస్తున్న వారందరూ బడుగు బలహీన వర్గాలకు చెందినవారని వీరందరూ నిరంతరం పేద ప్రజలకు సేవలందిస్తున్నారుని అన్నారు. కరోనా లాంటి కాలంలో కూడా ముందు వరుసలో ఉండి ప్రజలకుసేవలందించారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్‌ల సేవలను గుర్తించి వారికి తగిన అర్థిక కేటాయింపులతో ఎన్‌హెచ్ఎం స్కీంను కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఆరోగ్య స్కీంగా మార్చాలన్నారు. ఆశావర్కర్‌లను కార్మికులుగా గుర్తించి కనీసవేతనం రూ 26వేలు చెల్లించడంతోపాటు పీఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ , పెన్షన్ చెల్లించాలన్నారు. అన్ని సామాజిక భద్రత ప్రయోజనాలకు నెలకు రూ 10వేల కంటే తక్కువ కాకుండా చెల్లించడంతోపాటు అన్నిరకాల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. అశావర్కర్‌లకు పని భారం తగ్గించాలని పారితోషికం లేని పనులు చేయించవద్దన్నారు. అంగన్‌వాడీలకు గ్రాటూటీ వర్తింపజేస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును స్కీం వర్కర్‌లల్లో భాగమైన ఆశాలకు వర్తింపజేయాలన్నారు. ఆరునెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు. మెడికల్ సెలవుల కోసం ఖచ్చితమైన నిబంధనలు రూపొందించాలని ఏఎన్ఎం, జిఎన్ఎం నియమాకాల్లో అశాలకు ప్రమోషన్ విధానాన్ని రూపొందించలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులుఅన్నల్‌దాస్‌గణేష్, అశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బదవేణి మంజుల , కస్తురి ,రేణుక, పద్మ, జమున, సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.